క్లుప్తంగా

ఆర్థిక సహాయం



నగదు అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: బీఆర్‌ఎస్ మహిళా నేత రత్తారపు మల్లీశ్వరికి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, కొక్కు నాగేశ్వరరావు, జేకే శ్రీను, పెండ్యాల హరికృష్ణ, మురళి, యలమద్ది రవి తదితరలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం ఇల్లెందులపాడులోని ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు అందజేసి ఆమెను పరామర్శించారు. మల్లీశ్వరీ భర్త శ్రీను భద్రాచలం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డారు. కష్టాల్లో ఉన్న ఆమెను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మేకల శ్యామ్, యాకుబ్, చంద్రావతి, భాగ్యలక్ష్మి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తెలిపారు. శుక్రవారం 26వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్నవారికి కళ్ల జోడ్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, వార్డు కౌన్సిలర్ అంబుల వేణు, డాక్టర్ మౌనిక, కాపు కృష్ణ, రాకేష్ పాల్గొన్నారు.

'ఉపాధి'పై చిన్నచూపు

ఇల్లెందురూరల్: ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు సూర్నపాక నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని రొంపేడు గ్రామంలో ఉపాధి కూలీలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నెల రోజులుగా ఉపాధి కూలీలకు సంబంధించిన కూలి డబ్బులు చెల్లించకుండా ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. మండుటెండల్లో పని చేస్తున్న కూలీలకు సకాలంలో కూలీ డబ్బులు చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు.

జీఓలతో పేదలకు ఒరిగిందేమీ లేదు..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ ప్రజలకు ఇంటిపట్టాల పంపిణీ ప్రక్రియ ఈసారైనా పారదర్శకంగా జరగాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఇల్లు కట్టుకొని జీవిస్తున్న వారికి యాజమాన్య హక్కు కల్పించడం కోసం ఎన్ని జీఓలు తెచ్చినా పేదవాడికి ఇంటిపట్టా అందని ద్రాక్షలానే మిగిలిపోయిందని విమర్శించారు. జీఓల వలన అధికారులకు, అధికార పార్టీ నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోందని, ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేసి పట్టాలు చేయించుకోవడానికి తప్ప, సామాన్యులకు ఒరిగేదేమీ లేదన్నారు. గంధం మల్లికార్జునరావు, నాగుల రవికుమార్, ఆట శ్రీకాంత్, సిద్ధంకి మల్లేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుడియా బాపు జాతర



జాతరలో పూజలు చేస్తున్న గిరిజనులు

పాల్వంచరూరల్: మండల పరిధి ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామంలో శుక్రవారం గిరిజనుల ఆరాధ్యదైవమైన శ్రీశ్రీశ్రీ బాలాజీ బుడియ బాపు జాతర మహోత్సవ భోగ్ బండారో పూజలు శుక్రవారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. బోడ భాస్కర్ మహారాజ్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగదాంబ మేరమ్మ, బుడియా బాపు గిరిజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు నాయక్, చందుమహారాజ్, రామ్‌పాల్ మహారాజ్, లక్ష్మణ్ మహారాజ్, సర్పంచ్ బానోతు భిక్షం, సురేష్, కబీర్, దిలీప్ స్థానికులు పాల్గొన్నారు.

కలగానే మినీ ట్యాంక్ బండ్!

- ఏడేళ్లుగా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!
- చింతల చెరువు పనులపై దృష్టేది..
- ప్రజలకు అందని ద్రాక్షలా ఆహ్లాదం



చుంచుపల్లి చింతల చెరువు

చుంచుపల్లి: కొత్తగూడెంలో మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు ఏడేళ్లుగా కలగానే మిగిలిపోయింది. ప్రజలకు ఆహ్లాదం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక మినీ ట్యాంక్ బండ్ నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొత్తగూడెం జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న చుంచుపల్లి చింతల చెరువును అధికారులు ఎంపిక చేశారు. 2016లో చింతలచెరువు రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులను కేటాయించింది. మినీ ట్యాంక్ బండ్ పనులకు శ్రీకారం చుట్టారు. మొదట యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించిన అధికారులు, కాంట్రాక్టరు 45 శాతం వరకు పనులను పూర్తి చేసి ఆ తరువాత వదిలేశారు. చెరువు కట్టపై టైల్స్, వాకింగ్ ట్రాక్ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఇక విద్యుదీకరణ, సుందరీకరణ పనులు ప్రారంభించనే లేదు. కాంట్రాక్టరు పట్టించుకోకపోవడంతో దాదాపు ఏడేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటి వరకు జరిగిన పనులు శిథిలావస్థకు చేరుకున్నాయి. చింతలచెరువు బాగోగులను పట్టించుకోకపోవడంతో చెరువు పరివాహక ప్రాంతం కబ్జాకు గురవుతోంది. చెరువు చుట్టు పక్కల పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. 14 ఎకరాలు విస్తీర్ణం ఉన్న చింతల చెరువు ప్రస్తుతం తొమ్మిది ఎకరాలకు చేరుకుంది. మిగిలినదంతా ఆక్రమణకు గురైంది. స్థానికులు చెరువు స్థలాన్ని ఆక్రమించుకొని అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అందని ద్రాక్షలా ఆహ్లాదం..

చుంచుపల్లి మండలంలో పాత చుంచుపల్లి గ్రామ పంచాయతీ ఉండేది. దాని పరిధిలో ఏడు గ్రామ పంచాయతీలు 2019 వరకు కొనసాగాయి. ఉమ్మడి చుంచుపల్లి గ్రామ పంచాయతీలో 9,236 కుటుంబాలు నివాసముండేవి.

వాటి పరిధిలో 25,273 మంది జనాభా. చుంచుపల్లిలో అన్ని వనరులను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం చింతలచెరువుపై మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ప్రస్తుతం ఈ చెరువు విద్యానగర్ కాలనీ పంచాయతీ పరిధిలోకి వచ్చింది. అంతేకాకుండా ఈ ప్రాంతమంతం పరిధిలో కొనసాగుతున్న ఏడు పంచాయతీలు కూడా జిల్లా కేంద్రం కొత్తగూడెం పట్టణంతో అనుసంధానమై ఉన్నాయి.

ప్రస్తుతం బాబు క్యాంపు, ఎన్‌కే నగర్, విద్యానగర్ కాలనీ, రామాంజనేయ కాలనీ, చుంచుపల్లి తండా, నందాతండా, వెంకటేశ్వర కాలనీ గ్రామ పంచాయతీల ప్రజలకు ఈ మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంతో ప్రయోజనం చేకూరుతుంది. అందరికీ అందుబాటులో ఉండేలా చింతలచెరువును సుందరీకరిస్తే ఏడు పంచాయతీల ప్రజలతో పాటు కొత్తగూడెం పట్టణవాసులకు కూడా ఆహ్లాదం అందే వీలుంటుంది. అధికారులు చింతలచెరువుపై నిలిచిపోయిన ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



చింతల చెరువుపై మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు విషయంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం 2016లో రూ.2.50 కోట్లు కేటాయించింది. హడావుడిగా ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు.

– బానోత్ గోవింద్, సర్పంచ్, విద్యానగర్ కాలనీ

కలగానే మిగిలింది



విద్యానగర్ కాలనీ పంచాయతీలో ఉన్న చింతలచెరువుపై ప్రభుత్వం మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం మంచి పరిణామం. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ఆగిపోయాయి. తక్షణమే పనులు ప్రారంభించి చెరువును సుందరీకరించాలి.

– జకరయ్య, విద్యానగర్ కాలనీ

ఆక్రమణలపై కఠిన చర్యలు



చింతల చెరువు భూములు అక్రమణకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. చెరువు పరిధిలో ఉన్న భూములు మొత్తం ఎంత అనే దానిపై ఇరిగేషన్ అధికారులతో కలిసి సర్వే నిర్వహిస్తాం. చెరువు భూముల విషయంలో ఎవరైనా స్థానికులు ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

– వి.కృష్ణ ప్రసాద్, తహసీల్దార్, చుంచుపల్లి

మార్చిలో 96 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న ఏరియా జీఎం రమేష్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో మార్చి నెలకు గాను సింగరేణి యజమాన్యం నిర్దేశించిన 13.40 లక్షల టన్నుల లక్ష్యానికి 13.12 లక్షల టన్నులు (96 శాతం) ఉత్పత్తి నమోదైంది. ఈ మేరకు కొత్తగూడెంలోని కార్యాలయంలో ఏరియా జీఎం జక్కం రమేష్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను లక్ష్యంలో 91 శాతం సాధించామని చెప్పారు. ఇందులో జేవీఆర్ ఓసీ 100 లక్షల టన్నులు, కిష్టారం ఓసీ 20 లక్షల టన్నులు, జీకే ఓసీ 5.88 లక్షల టన్నుల ఉత్పత్తి జరగగా, పీవీకే-5షాఫ్ట్ గనిలో 43 శాతం మాత్రమే ఉత్పత్తి అయిందని తెలిపారు. ఇక వీకే-7షాఫ్ట్ గనికి 10 లక్షల టన్నుల లక్ష్యం కేటాయించినా అనుమతులు రాని కారణంగా ఉత్పత్తి జరగలేదని వెల్లడించారు. కాగా, ఏరియా నుంచి మార్చిలో 324 రేకుల బొగ్గు రవాణా జరగగా, ఆర్థిక సంవత్సరం మొత్తంగా 2,706 రేకుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని జీఎం తెలిపారు. పెనగడప గ్రామాన్ని దత్తత తీసుకొని మౌలిక వసతుల కల్పనతో పాటు పార్క్ ఏర్పాటు చేయనున్నామని, ఏరియాలోని ప్రొఫెసర్ జయశంకర్ మైదానానికి ప్రహరీ నిర్మించి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు రమేష్, వెంకటేశ్వరరావు, సామ్యూల్ సుధాకర్, బి.సూర్యనారాయణ, యోహాన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న స్థానికులు

ఇల్లెందురూరల్: మండలంలోని ధనియాలపాడు గ్రామపంచాయతీ ధనియాలపాడు, బాలాజీ తండా, సేవ్యా తండా గ్రామాలలో శుక్రవారం నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను పురస్కరించుకొని ఆయా గ్రామాలలో ఆడపడుచులు, బంధువులు చేరుకోవడంతో సందడి నెలకొంది. గ్రామాలను మామిడి తోరణాలతో అలంకరించడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. రెండు రోజులుగా గ్రామస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏప్రిల్ 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు జీఓ 76కు సంబంధించి దరఖాస్తులను మీ సేవా కేంద్రాల ద్వారా స్వీకరిస్తామని కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పట్టాల క్రమబద్ధీకరణకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌లో వేయాలని సూచించారు. ఫిర్యాదులను 9392919750 నంబరుకు వాట్సాప్ కూడా చేయవచ్చని తెలిపారు.

12మందిపై కేసు

పాల్వంచరూరల్: దంతలబోరు గ్రామపంచాయతీ బస్వరాయి చెరువులో పెంచుతున్న చేపలను దొంగతనంగా పట్టుకున్న ఘటనలో 12 మందిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గంగదేవిగుప్ప గ్రామానికి చెందిన సమ్మక్క, సారక్క చేపల సొసైటీ గిరిజనులు మత్స్యశాఖ అధికారుల అనుమతితో చేపలు పెంచుతున్నారు. కాగా గిరిజనేతరులు రూ.50 వేల విలువైన 5 టన్నుల చేపలను పట్టుకున్నారని సొసైటీ అధ్యక్షుడు కాక రమేష్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

కొత్తగూడెంటౌన్: ఎదైనా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని లీడింగ్ ఫైర్‌మెన్ హెడ్ కానిస్టేబుల్ (ఎల్ఎఫ్ ఆఫీసర్)షేక్ సైదులు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం ఫైర్ స్టేషన్ శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని షాపుల యజమానులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో, ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ఎలక్ట్రికల్ ఫైరింగ్ జరిగితే మీటర్ బోర్డులు లేదా స్విచ్ బోర్డులు మండితే డీసీబీ కానీ కార్బన్‌డైఆక్సైడ్‌తో మంటలను ఆర్పివేయాలని, ఎలక్ట్రికల్ ఫైరింగ్ జరిగినపుడు ఎట్టి పరిస్థితుల్లో నీళ్లను ఉపయోగించవద్దని చెప్పారు. వైర్లలో లీకేజ్ ఉంటే కరెంట్ షాక్ కొట్టే ప్రమాదం ఉంటుందని తెలిపారు. అలాగే గ్యాస్ ప్రమాదాల పట్ల మరింతగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తక్షణమే 101కి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్ ఎస్.ఆజార్, డ్రైవర్ కార్తీక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం

ఇల్లెందురూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు ఆరోపించారు. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రాంతీయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన, గిరిజనేతర పేదలకు హక్కు పత్రాలు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంగా దూరంగా ఉండటం వల్ల ఉమ్మడి చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తక్షణం స్పందించి చల్లసముద్రం కేంద్రంగా పీహెచ్‌సీని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ముకుందాపురం క్యాంపు సెంటర్ నుంచి లచ్చగూడెం వరకు నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, నరాటి వెంకటేశ్వర్లు, బొగ్గారపు సంగయ్య, బొగ్గారపు వెంకన్న, కల్తి సుభద్ర, వెంకటమ్మ, భద్రమ్మ, లక్ష్మి, మంగమ్మ, సోమన్న, వెంకన్న, రంగయ్య పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి ప్రజల నుంచే గుణపాఠం



మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్, పక్కన పొదెం వీరయ్య, ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: పార్లమెంట్‌లో ప్రజల సమస్యలను లేవనుత్తుతున్న రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్, ఏఐసీసీ ఆదివాసీ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక తాటిపల్లి హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ సెప్టెంబర్ 7 తేదీ నుంచి భారత్ జోడ్ యాత్ర నిర్వహించటం జరిగిందని, ఈ క్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు పార్లమెంట్‌లో ప్రశ్నించినందుకు ప్రధాని మోదీ.. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని ఆరోపించారు. మోదీ అదానీలు భారత సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. దేశంలోని 29 మందికి బ్యాంకుల్లో రూ.కోటి లక్షల కోట్లు అప్పు ఉందని అందులో 28 మంది గుజరాత్‌కు చెందిన వారేనని ఆరోపించారు. ప్రధాని ఇతర దేశాలకు సహాయ సహకారాలు అందిస్తూ.. ఆయా దేశాలలో అదానికి కాంట్రాక్టర్లు ఇప్పిస్తున్నారని ఆరోపించారు. దేశంలోని ఎఫ్‌సీఐ గోడౌన్లు, ఎల్ఐసీ సంస్థ కూడా అదాని చేతుల్లోనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రాష్ట్రంలో, జిల్లాలో రాహుల్‌గాంధీపై అనర్హత వేటు కోసం ఖండన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయటం సరైంది కాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీకి త్వరలో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, సభ్యులు నాగసీతారాములు, బాలశౌరి, చక్రవర్తి బుడిగం శ్రీనివాస్, చీమల వెంకటేశ్వర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోతుకూరి ధర్మారావు, చింతపుడి రాజశేఖర్, డాక్టర్ రవి, బొమ్మిడి మల్లికార్జున్‌రావు, రాయల శాంతయ్య, సకినాల వెంకటేశ్వర్లు, అంతోటిపాల్, పల్లపు వెంకటేశ్వర్లు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

పాల్వంచ: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు సమాజానికి దిక్సూచి లాంటి వారన్నారు. వారి సర్వీస్‌లో చేసిన సమాజాభివృద్ధి ఎంతో అమూల్యమైందన్నారు. సమాజ సేవలో శాయశక్తులా ముందుండాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే వనమాను రిటైర్డ్ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎస్ఎస్.అజరయ్య, ఆర్.వెంకటేశ్వరరావు, చింతోజు బ్రహ్మారావు, మహిపతి రామలింగం, నారాయణరావు, ఆనందకుమార్, షాబుద్దీన్‌ఖాన్, కన్నయ్య, జానిమియా, భిక్షమయ్య, సుందర్‌రావు, రాంబాయి, వెంకటేశ్వరరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వొద్దు



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ఎడ్యుకేషనల్ సొసైటీ జీఎం వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని, ఒత్తిడికి లోనవకుండా ప్రణాళికా బద్ధంగా పరీక్షలు రాయాలని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ జీఎం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ జీఎం వెంకటేశ్వరరావు హాజరై విద్యార్థులకు హాల్ టికెట్, పరీక్ష సామగ్రి అందజేశారు. మాట్లాడుతూ.. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. హెచ్ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు సాయిసుజాత, ప్రసన్న, జయమ్మ, శివరాణి, కళ్యాణి, నాగలక్ష్మి, సైదా, సమీనా, స్వర్ణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రసాద్

ఇల్లెందు: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రజాపంథా అనుబంధ ఇఫ్టూ జిల్లా కార్యదర్శి డి.ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదన్నారు. కార్మికులకు పెంచిన వేతనాలు అమలులోకి రావటం లేదని, అన్ని రకాల హక్కులు అమలు జరగడం లేదన్నారు. సమస్యలు పరిష్కారం, హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇల్లెందులో ఏప్రిల్ 9న మున్సిపల్ కార్మికుల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని, ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పని చేసే కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

స్వయం కృషితో ఆర్థికాభివృద్ధి

టేకులపల్లి: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని.. ఉపాధి, ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం కృషితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు పరిధిలో అదే గ్రామానికి చెందిన లకావత్ రాజశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వప్రియ ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోల్ బంక్‌ను ఆమె ప్రారంభించారు. ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు నుంచి బొమ్మనపల్లి మధ్యలో ఎక్కడ బంక్ లేదని ఈ ఏరియాలో బంక్ ఏర్పాటు అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, లక్కినేని సురేందర్, పూనెం ఉమ, లకావత్ రాజశేఖర్, సతీష్, డి.బాలాజీ, బీవీ ప్రసాద్, బాలు, పూనెం సురేందర్, సత్యానారాయణ, భూక్యా సైదులు, తావుర్యా, లింబ్యా, శివకృష్ణ పాల్గొన్నారు.

గిరిజనేతరులకూ పోడు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచ: సాగులో ఉన్న పోడు భూములకు గిరిజనులతో పాటు, గిరిజనేతరులకు కూడా పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో మాట్లాడారు. ఏళ్ల తరబడి పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న పేదలను ఆదుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వందలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంటి తుడుపు చర్యలు కాకుండా రైతులను ఆదుకోవాలని విన్నవించారు. పాలకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏప్రిల్ 14 నుంచి జరిగే ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని, 18న పాల్వంచలో వేలాది మందితో పాదయాత్ర, బహిరంగ సభను నిర్వహించనున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, బండి నాగేశ్వరరావు, రాహుల్, పద్మజ, విశ్వేశ్వరరావు, నరహరి నాగేశ్వరరావు, శనగరపు శ్రీనివాస్, కోడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజం



విన్నర్, రన్నర్ జట్లతో జీఎం షాలేమురాజు

ఇల్లెందు: క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందేలా క్రీడలను ప్రోత్సహించాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం ఎం.షాలేమురాజు అన్నారు. శుక్రవారం 24 ఏరియా సింగరేణి గ్రౌండ్‌లో వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్, సింగరేణి కమ్యూనికేషన్ సెల్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగులు– ప్రెస్‌క్లబ్ సభ్యుల మధ్య క్రికెట్ పోటీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలలో గెలుపోటములు సహజమని, గెలిచిన వారు గర్వపడకుండా ఓడిన వారు నిరుత్సాహ పడవద్దని సూచించారు. జర్నలిస్టులతో క్రికెట్ మ్యాచ్ ఏర్పాటు చేయటం సంతోషకరం అన్నారు. ప్రతి ఏటా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించుకోవటం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేశారు. సింగరేణి అధికారుల జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ప్రెస్ క్లబ్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 92 పరుగులు చేశారు. అనంతరం 11.2 ఓవర్లలో సింగరేణి అధికారుల జట్టు విజేతగా నిలిచింది. అనంతరం జీఎం షాలేమురాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు శ్రీహరి, సాయి స్వరూప్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుర్రం రాజేష్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సింగరేణి అధికారులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పాఠశాల భవనం పూర్తయ్యేదెన్నడో..?

టేకులపల్లి మండలం బద్దుతండా గ్రామపంచాయతీ సామ్యాతండా ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో దీని వెనుకాలే స్థలం సేకరించారు. రూ.9లక్షలు మంజూరయ్యాయి. 2021 డిసెంబర్‌లో నిర్మాణం ప్రారంభించారు. నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : యూసుఫ్, ఆర్‌వీఎం ఏఈ, టేకులపల్లి
సెల్ నంబర్ : 99598 11973